క్లుప్తంగా

నల్లూరు, నేలటూరుల్లో చేనేత అధికారుల పర్యటన


నేలటూరులో మగ్గం నేతను పరిశీలిస్తున్న ఏడీ రాజు

కపిలేశ్వరపురం: మండలంలోని నేలటూరు, నల్లూరు గ్రామాల్లోని చేనేత వాడల్లో మంగళవారం జిల్లా జౌళి శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ రాజు, ఏడీఓ వెంకటేశ్వర్లు పర్యటించారు. ఆయా గ్రామాల్లో నేతన్న నేస్తం పథకం ద్వారా రూ.24 వేల చొప్పున నాలుగు విడతల లబ్ధి పొందిన వారి జీవన స్థితిగతులను తెలుసుకున్నారు. ప్రభుత్వ సాయం ఆ కుటుంబాలకు ఏవిధంగా ఉపకరిస్తుందన్న అంశాలను పరిశీలించారు. గత విడతలో నేలటూరులో 223 మంది, నల్లూరులో 40 మంది నేతన్న నేస్తం పథకం ద్వారా రూ.24 వేల చొప్పున పొందినట్టు ఆయా గ్రామాల వెల్ఫేర్ అసిస్టెంట్లు దుర్గారావు, తాడి వెంకటసత్య లక్ష్మి తెలిపారు. అధికారులు వెంట నేలటూరు చేనేత సహకార సంఘం చైర్మన్ చల్లా వీరవెంకట సత్యనారాయణ ఉన్నారు.

కేశవరంలో నేడు అభివృద్ధి పనులకు భూమి పూజ

మండపేట: మండలంలోని కేశవరం గ్రామంలో పలు అభివృద్ధి పనులకు బుధవారం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు భూమిపూజ నిర్వహించనున్నట్టు వైఎస్సార్ సీపీ గ్రామ కమిటీ తెలిపింది. గ్రామంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలలో గ్రామానికి చెందిన ముక్కపాటి చిన్నబాబు ఏర్పాటు చేసిన సరస్వతీదేవి విగ్రహాన్ని ఉదయం ఎమ్మెల్సీ ఆవిష్కరించి విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లు అందజేస్తారు. అనంతరం హైస్కూల్ ప్రహరీ నిర్మాణానికి, అలాగే ఆంజనేయస్వామి ఆలయం ముందు రోడ్డు, గ్రామంలోని పలు రోడ్లు నిర్మాణానికి ఎమ్మెల్సీ తోట భూమిపూజ చేస్తారన్నారు.

త్వరితగతిన ఇల్లు కట్టుకోండి


నేలటూరులో లబ్ధిదారులకు అవగాహన కల్పిస్తున్న ఏఈ మూర్తి

కపిలేశ్వరపురం: ప్రభుత్వం అదిస్తున్న ఆర్థిక సాయాన్ని సద్వినియోగం చేసుకుని సొంత ఇంటి కలను సాకారం చేసుకోవాలని లబ్ధిదారులకు ఎంపీడీఓ ఎం.రామకృష్ణారెడ్డి సూచించారు. మండలంలోని నేలటూరు, మాచర తదితర గ్రామాల్లోని జగనన్న లే అవుట్లను ఆయన మంగళవారం సందర్శించారు. ప్లాటు పొందిన లబ్ధిదారులతో సమావేశమయ్యారు. ప్రభుత్వం ఉచితంగా ఇచ్చిన స్థలంలో త్వరితగతిన ఇల్లు నిర్మించుకోవాలని లబ్ధిదారులకు ఏఈ పీవీవీఎస్ఎన్‌మూర్తి సూచించారు. నేలటూరులోని నాలుగు జగనన్న లేఅవుట్లలో 150 మందికి పట్టాలిచ్చారు. వారిలో 138 మందికి ఇంటి రుణం మంజూరైంది. 56 మంది ఇళ్ళ నిర్మాణాలను ఇప్పటికే పూర్తి చేసుకోగా 71 మందికి చెందిన ఇళ్ల నిర్మాణాలు వివిధ దశల్లో ఉండగా 11 పనులను ప్రారంభించాల్సి ఉందని కార్యదర్శి రామకృష్ణ వివరించారు. వారి వెంట సచివాలయ ఇంజినీరింగ్ సహాయకుడు నిమ్మకాయల పద్మరాజు ఉన్నారు.

భీమేశ్వరాలయంలో 18 వరకు విరాట పర్వం ప్రవచనాలు


భీమేశ్వరాలయంలో విరాట పర్వం ప్రవచనం చెబుతున్న భరణి రాజ్‌కుమార్‌శర్మ

రామచంద్రపురం రూరల్: లోక సంరక్షణార్థం, రైతులు సుభిక్షంగా ఉండాలని వేసవి తాపం తగ్గి సకాలంలో వర్షాలు కురవాలని, పంటలు బాగా పండాలని రాష్ట్రం సుభిక్షంగా ఉండాలన్న సంకల్పంతో ఉన్నతాధికారులు ఆదేశాల మేరకు ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వర స్వామి ఆలయంలో ఈ నెల 10 నుంచి 18 వరకు మహాభారతంలోని విరాట పర్వం ప్రవచనాలు చెప్పిస్తున్నట్లు ఆలయ ఈఓ పితాని తారకేశ్వర రావు తెలిపారు. ద్రాక్షారామకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయుడు కొంపెల్ల భరణి రాజ్‌కుమార్ శర్మ ప్రతిరోజూ సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు ప్రవచనాలు చెబుతున్నారు. భక్తులు ప్రవచనాల కార్యక్రమంలో పాల్గొని సద్వినియోగం చేసుకోవాల్సిందిగా ఈఓ కోరారు.

వస్త్రాల షాపులో నగదు చోరీ

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామలో బట్టలషాపులో గుర్తు తెలియని వ్యక్తులు చొరబడి రూ.10 వేల నగదు చోరీ చేసినట్లు ద్రాక్షారామ ఏఎస్సై ఎస్.దుర్గాబాయి మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ నెల 11న అర్ధరాత్రి ద్రాక్షారామ ఆర్టీసీ బస్టాండు సమీపాన శ్రీవెంకటదుర్గా శారీ మందిర్ షాపు పైన శ్లాబును పగలగొట్టి షాపులోకి ప్రవేశించిన దుండగులు నగదు చోరీ చేసినట్లు షాపు యజమాని ధవళేశ్వరపు సత్యవెంకట దుర్గాప్రసాద్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

రక్తమిద్దాం.. ప్రాణం పోద్దాం


సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పుట్టినరోజు సందర్భంగా నిర్వహించిన రక్తదాన శిబిరం (ఫైల్)

- రక్తదాన శిబిరాలతో మేలు
- అవగాహన లేమే ప్రధాన అడ్డంకి

రామచంద్రపురం రూరల్: మనుషులకు ప్రాణాపాయకర పరిస్థితుల్లో రక్తం అవసరమైనప్పుడు మరొకరి నుంచి సేకరించి ఇవ్వడం తప్ప ప్రస్తుతానికి ఈ ప్రపంచంలో వేరే ప్రత్యామ్నాయం లేదు. అందుకే రక్తదానానికి ఎంతో ప్రాముఖ్యం ఉంది. ఒకరి నుంచి సేకరించిన రక్తం ముగ్గురికి పైగా ప్రాణాలు కాపాడడానికి ఉపయోగపడుతుంది. అయితే దురదృష్టవశాత్తూ చాలా మందిలో రక్తదానంపై సరైన అవగాహన లేకపోవడంతో అవసరానికి తగినంతగా రక్తదానం జరగడం లేదనే చెప్పుకోవాలి. రక్తదానాన్ని ప్రోత్సహించడంలో నియోజకవర్గంలో కొంతమంది వ్యక్తులు, కొన్ని సంస్థలు ముందుంటున్నారు. రామచంద్రపురం పట్టణానికి చెందిన తొగరు మూర్తి, చిలుకూరి సేవా సమితి, మోడ్రన్ విద్యాసంస్థలు, వీఎస్ఎం విద్యా సంస్థలు, విశ్వ చైతన్య శక్తి చారిటబుల్ ట్రస్ట్, ద్రాక్షారామకు చెందిన స్వీట్ స్టాల్ చక్రి, అద్దాల కొట్టు నిర్వహించే కొమ్మిశెట్టి కామేష్, ఆదివారపుపేటకు చెందిన స్వామి వివేకానంద దేవాంగ యువజన సేవాసమితి, కె.గంగవరం మండలంలో కె.గంగవరానికి చెందిన యువకుడు శ్యామ్, కాజులూరు మండలంలో కాజులూరుకు చెందిన యువకుడు వంశీకృష్ణ, మంత్రి వేణు తనయుడు చెల్లుబోయిన నరేన్ ఆధ్వర్యంలో యువకులు వ్యక్తిగతంగా రక్తదానాన్ని ప్రోత్సహిస్తూ తమ వద్ద రక్తదానం చేసేవారి ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచుకుని అవసరమైనప్పుడు వారిని ప్రోత్సహించడమే కాకుండా రక్తదాన శిబిరాలు కూడా నిర్వహించడంలో కీలక పాత్ర పోషిస్తున్నారు. వీరికి ప్రస్తుతం అద్దంపల్లికి చెందిన ల్యాబ్ టెక్నీషియన్ చింతపల్లి వాసు బ్లడ్ బ్యాంకులకు వీరికి మధ్య అనుసంధానకర్తగా ఉండి తనవంతు సహకారం అందిస్తున్నారు. రక్తదాన శిబిరాలు జరిగినప్పుడు ఒక్కొక్కరి నుంచి 300 మి.లీ. రక్తం సేకరిస్తారు (రక్తం సేకరించే ప్యాక్‌లో ముందుగానే 49 మి.లీ. సీపీడీ సొల్యూషన్ ఉంటుంది. దానితో కలిపే 300 మి.లీ.) ఇలా అందరి నుంచీ సేకరించిన రక్తాన్ని బ్లడ్ స్టోరేజ్ బాక్సులలో జెల్ ప్యాక్స్ మధ్యలో ఉంచి బ్లడ్ బ్యాంకులకు తరలిస్తారు. ఈ స్టోరేజ్ బాక్సులలో రక్తం 6 నుంచి 7 గంటల వరకు నిల్వ ఉంటుంది. ఈ లోపు బ్లడ్ బ్యాంకులకు చేరవేసి బ్లడ్ స్టోరేజీ ఫ్రిజ్‌లలో నిల్వ చేస్తారు. ఈ ఫ్రిజ్‌లలో 4 నుంచి 6 డిగ్రీల ఉష్ణోగ్రత వద్ద సుమారు 35 రోజుల వరకు రక్తం నిల్వ ఉంటుంది. ఈ సమయంలో అవసరమైన వారికి రక్తాన్ని అందజేస్తారు. డ్రగ్ అండ్ కాస్మోటిక్స్ యాక్ట్ ప్రకారం రక్తదానం చేసేవారి రక్తాన్ని ముందుగా పరీక్షించే అవకాశం లేదు. కేవలం హెచ్‌బీ శాతం మాత్రమే పరీక్షించి సరిపడా రక్తం ఉన్నవారి నుంచి రక్తం సేకరిస్తారు. బ్లడ్ బ్యాంకులకు తరలించిన తరువాత మాత్రమే పరీక్షలు నిర్వహించి హెచ్‌బీఎస్ ఏజీ, హెచ్‌సీవీ, హెచ్ఐవీ, మలేరియా, సిఫిలిస్ తదితర పరీక్షలు నిర్వహిస్తారు. ఒక రక్తదాన శిబిరం నిర్వహిస్తే సేకరించిన రక్తంలో పనికిరాకుండా పోయేదేమీ ఉండదు. కానీ ఇటువంటి వ్యాధులు ఉన్నవారి నుంచి రక్తం సేకరించినప్పుడు మాత్రమే ఈ సమస్య తలెత్తుతుంది. నిర్వాహకులు తెలిపిన దాని ప్రకారం సాధారణంగా 4 నుంచి 5 శాతం హెచ్‌బీఎస్ ఏజీ, సిఫిలిస్ కేసులు, 2 శాతం హెచ్ఐవీ, హెచ్‌సీవీ కేసులు నమోదవుతూ ఉంటాయని అంటున్నారు. సమస్యలు ఉన్న రక్తాన్ని ప్యాక్‌లోనికి వైరస్ ను నాశనం చేసే కెమికల్స్‌ను ఎక్కించి తరువాత హాస్పిటల్ వేస్ట్‌లను సేకరించి నాశనం చేసే సంస్థ రాజమహేంద్రవరంలోని ఈవీబీ టెక్నాలజీస్‌కు అప్పజెప్పుతారు. ఎవరి రక్తంలో అయితే వ్యాధుల ఉన్నట్లు తేలిందో వారికి కూడా సమాచారం అందిస్తారు.

రక్తం కావాల్సినవారు సంప్రదించండిలా..

పేరు	ఊరు	ఫోన్ నెంబరు
తొగరు మూర్తి	రామచంద్రపురం	9848246878
కొమ్మిశెట్టి కామేశ్	ద్రాక్షారామ	9866436704
కంచెర్ల చక్రధరరావు(చక్రి)	ద్రాక్షారామ	7075072110
పీవీఎన్ గంగాధర్	రామచంద్రపురం	6300528311
పాటి అభి	తాళ్లపాలెం	9121530261
పీతల శ్యామ్	కె.గంగవరం	8886583422
యాళ్ల బుజ్జి	కాజులూరు	9963474462
తలాటం రాంబాబు	కాజులూరు	8919562044

రక్తదానానికి అందరూ ముందుకు రావాలి



ప్రతి మనిషికి ఎప్పటికప్పుడు కొత్తగా రక్తం పుడుతూ ఉంటుంది. దాని వల్ల మనం రక్తదానం చేసినా మళ్లీ వారం రోజుల్లో మనకు కొత్త రక్తం పుడుతుంది. మనమిచ్చే రక్తం మరో ముగ్గురి ప్రాణాలు కాపాడుతుంది. ప్రతి ఒక్కరూ రక్తదానానికి ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

– స్వీట్ స్టాల్ చక్రి, ద్రాక్షారామ

శిబిరాలు పెరగాల్సిన అవసరం ఉంది



రక్తదాన శిబిరాలు ఇంకా పెరగాల్సిన అవసరం ఉంది. రక్తదానంపై చాలా మందికి అపోహలు ఉన్నాయి. నీరసించి పోతామని అనుమానాలు ఉన్నాయి. ఇలా రక్తదానం చేయడం వల్ల ఎటువంటి నష్టాలు ఉండవు. పైగా మరొకరికి ప్రాణదానం చేశామన్న సంతృప్తి కలుగుతుంది.

– చింతపల్లి వాసు, డీఎంఎల్‌టీ టెక్నీషియన్

నవరత్నాలతో పేదల అభ్యున్నతి

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- రాయవరంలో గడప గడపకూ..

రాయవరం: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి నవరత్నాల పథకాల ద్వారా రాష్ట్రంలో పేదల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. మంగళవారం రాయవరంలో ఆయన గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రజా సాధికారితే లక్ష్యంగా సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తోందన్నారు. అన్ని వర్గాల సంక్షేమానికి కృషి చేస్తున్న సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరోసారి ఆశీర్వదించాలని కోరారు. జగనన్న పరిపాలన మీద ప్రజలకు పూర్తి విశ్వాసం ఉందన్నారు. నవరత్నాలు పేరుతో అన్ని హామీలను నెరవేర్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్నారు. తొలుత దివంగత ముఖ్యమంత్రి డాక్టర్ వైఎస్ రాజశేఖరరెడ్డి, డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మాజీ ఉప ప్రధాని బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు ఎమ్మెల్సీ త్రిమూర్తులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. గడపకు వెళ్లి ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు, ప్రజలు పొందుతున్న లబ్ధితో ఉన్న కరపత్రాలను ఆయన ప్రజలకు అందజేశారు. కార్యక్రమంలో మండపేట వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ సిరిపురపు శ్రీనివాసరావు, జెడ్పీటీసీ సభ్యురాలు నల్లమిల్లి మంగతాయారు, ఎంపీపీ నౌడు వెంకటరమణ, సర్పంచ్ చంద్రమళ్ల రామకృష్ణ, ఉప సర్పంచ్ బొడ్డు శ్రీనివాస్, గ్రామాభివృద్ధి కమిటీ చైర్మన్ తేతల సుబ్బరామారెడ్డి, మండల సర్పంచ్‌ల సమాఖ్య అధ్యక్షుడు ఆరిఫ్, వైస్ ఎంపీపీ కొవ్వూరి అమ్మిరెడ్డి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ చిన్నం అపర్ణ, వైఎస్సార్‌సీపీ నేతలు పాల్గొన్నారు.


సంక్షేమ, అభివృద్ధిని వివరించే కరపత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్సీ త్రిమూర్తులు

వైఎస్సార్ సీపీ నేత భీమేశ్వరరావు మృతి


దడాల భీమేశ్వరరావు

కాజులూరు: శీల ఎంపీటీసీ సభ్యురాలు దడాల కృష్ణ కుమారి భర్త, మండల పార్టీ ఎస్సీ సెల్ కన్వీనర్ దడాల భీమేశ్వరరావు (64) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. భీమేశ్వరరావు శీల గ్రామ సర్పంచ్‌గా, శీల, ఒంటితాడి ఎంపీటీసీ సభ్యుడిగా, మంజేరు పీఏసీఎస్ చైర్మన్‌గా సేవలందించారు. స్వతహాగా కమ్యూనిస్టు కుటుంబమైనా దివంగత వైఎస్సార్ ఆశయాలకు ఆకర్షితుడై కాంగ్రెస్‌లో చేరారు. తదనంతరం వైఎస్ జగన్ స్థాపించిన వైఎస్సార్ సీపీలోనూ కొనసాగారు. ఆయనకు భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు. కుటుంబ సభ్యులు మంగళవారం గ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. రాష్ట్ర మంత్రి చెల్లుబోయిన శ్రీనివాసవేణుగోపాలకృష్ణ, రామచంద్రపురం వ్యవసాయ మార్కెటింగ్ కమిటీ చైర్మన్ పందుల గోవిందురాజు, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాసు తదితరులు భీమేశ్వరరావు భౌతికకాయానికి పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. మంత్రి వేణు మాట్లాడుతూ ఒక నిబద్ధత గల నాయకుడిని కోల్పోయామని ఆవేదన వ్యక్తం చేశారు. పార్టీకి చెందిన పలువురు నాయకులు అంతిమయాత్రలో పాల్గొన్నారు.


భీమేశ్వరరావు భౌతికకాయానికి పూలమాల వేసి శ్రద్ధాంజలి ఘటిస్తున్న మంత్రి వేణు తదితరులు

మెరుగుపడిన పారిశుధ్యం

సాక్షి ఇంపాక్ట్

కె.గంగవరం: పాణింగపల్లి గ్రామ ప్రారంభంలో రోడ్డు మార్జిన్ల వద్ద చెత్తా చెదారం వేయడంపై 'అధ్వానంగా పారిశుధ్యం' అనే శీర్షికన 'సాక్షి' దినపత్రికలో సోమవారం కథనం ప్రచురితమైంది. దీనికి ఎంపీడీఓ ఎస్.శ్రీనివాసరావు, ఈఓపీఆర్‌డీ నరేంద్ర, పంచాయతీ కార్యదర్శులు స్పందించారు. ఈఓపీఆర్డీ నరేంద్ర, పాణింగపల్లి, సత్యవాడ పంచాయతీ కార్యదర్శులు దగ్గరుండి పారిశుధ్య సిబ్బందితో చెత్తను తొలగించి రోడ్డు మార్జిన్లు శుభ్రం చేయించారు. జేసీబీ సహాయంతో చెత్తను ఒక చోట చేర్చి నిప్పు పెట్టారు. అధికారుల స్పందనను స్థానిక ప్రజలు, ప్రయాణికులు అభినందించారు.


పాణింగపల్లిలో దగ్గరుండి పారిశుధ్యాన్ని మెరుగు పరుస్తున్న అధికారులు

రొయ్యల చెరువులను వెంటనే తొలగించాలి

కె.గంగవరం: యర్రపోతవరంలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న రొయ్యల చెరువులను వెంటనే తొలగించాలని గ్రామానికి చెందిన పలువురు మంగళవారం తహసీల్దార్ వైద్యనాథ్‌శర్మకు వినతి పత్రం అందించారు. గ్రామానికి చెందిన సాపిరెడ్డి పద్మావతి, సాపిరెడ్డి వీరాస్వామి, వెంకట రమణలు సుమారు 15 ఎకరాల్లో మంచినీటిలో రొయ్యల పెంపకానికి అనుమతి తీసుకుని సాల్ట్‌వాటర్‌గా మార్చి అక్రమంగా సాగు చేస్తున్నారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో పాటు రొయ్యల చెరుకు కూత వేటు దూరంలో గ్రామానికి తాగునీరు సరఫరా చేసే వాటర్ ట్యాంకు ఉందని ఈ చెరువుల వల్ల భూగర్భజలాలు కలుషితమై తాగునీరు కూడా స్వచ్ఛంగా ఉండడం లేదని వారు ఆవేదన చెందుతున్నారు. సంబంధిత అధికారులు ఈ చెరువులపై తగిన చర్యలు తీసుకుని న్యాయం చేయాలని వారు వినతిపత్రంలో పేర్కొన్నారు.


ఫిర్యాదులో పేర్కొన్న గ్రామంలోని రొయ్యల చెరువులు

కంటి వెలుగుతో అంధత్వానికి చెక్

మండపేట: అంధత్వ సమస్య పరిష్కారానికి వైఎస్సార్ కంటి వెలుగు పథకం దోహద పడుతుందని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. పట్టణంలోని 8వ వార్డులో మంగళవారం కౌన్సిలర్ మందపల్లి రవికుమార్ అధ్యక్షతన జరిగిన వైఎస్సార్ కంటివెలుగు శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ తోట మాట్లాడుతూ వైద్య శిబిరాలు ద్వారా ముందుగానే కంటి సమస్యలు గుర్తించి అవసరమైన వైద్య సాయం అందించేందుకు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా అమలుచేస్తున్నారన్నారు. ఈ పథకం కింద కంటి చూపు మెరుగుపర్చేందుకు ఉచితంగా కళ్లజోళ్లు, మందులు అందించడంతో పాటు శస్త్రచికిత్సలు చేయిస్తారన్నారు. కంటి వైద్య నిపుణులు ఎస్. సత్యనారాయణ కంటి వైద్య పరీక్షలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు, కౌన్సిల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, కౌన్సిలర్ గ్రంధి శ్రీనివాస్, పార్టీ నాయకులు కొల్లి వరలక్ష్మి, యరమాటి వెంకన్నబాబు, మందపల్లి సుధాకర్, మందపల్లి సంజీవి, కొడమంచిలి భాస్కరరావు, సీహెచ్ సురేష్, గుడిమెట్ల శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉత్సవాలను విజయవంతం చేయాలి

ఆలమూరు: మండలంలోని చెముడులంకలో పవిత్ర కాలువ తీరాన వేంచేసిన ధనలక్ష్మి అమ్మవారి జాతర విజయవంతం చేయాలని సర్పంచ్ తమ్మన శ్రీనివాసు పిలుపునిచ్చారు. స్థానిక ఆలయ ఆవరణలో ఆలయ కమిటీ సభ్యుల పర్యవేక్షణలో మంగళవారం తీర్థ మహోత్సవాలకు అంకురార్పణ, రాట ముహూర్తం జరిగింది. ఈ కార్యక్రమానికి హాజరైన సర్పంచ్ తమ్మన ఆధ్వర్యంలో ఆలయ కమిటీ సభ్యులు పలు తీర్మానాలు చేశారు. జూలై నాలుగున అమ్మవారికి తీర్థోత్సవాలు జరుగుతాయన్నారు. భక్తులందరూ ఈ కార్యక్రమాల్లో పాల్గొని భక్తి పారవశ్యం పొందాలని ఆయన సూచించారు.

మోటార్ సైక్లిస్టుకు తీవ్ర గాయాలు

అయినవిల్లి: ట్రాక్టర్ ఢీకొని మోటార్ సైక్లిస్టుకు తీవ్ర గాయాలైన ఘటనపై మంగళవారం కేసు నమోదు చేసినట్లు ఎస్సై ఎస్.నాగేశ్వరరావు తెలిపారు. మండలంలోని సిరిపల్లి గ్రామానికి చెందిన బల్లా మనోజ్ బైక్‌పై ముక్తేశ్వరం నుంచి సిరిపల్లిలోని తన ఇంటికి వెళ్తున్నాడు. అమలాపురం నుంచి ముక్తేశ్వరం వైపు వస్తున్న ట్రాక్టర్ సిరిపల్లిలో అతి వేగంగా వచ్చి మనోజ్‌ను ఢీకొంది. గాయపడిన మనోజ్‌ను స్థానికులు వైద్యం కోసం అమలాపురంలోని ఓ ఆస్పత్రికి తరలించారు. బాధితుడు మనోజ్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గాయపడ్డ ఉద్యోగికి సాయం

అయినవిల్లి: మండలంలోని కె.జగన్నాథపురం సచివాలయం అసిస్టెంట్ లైన్‌మన్‌గా పనిచేస్తున్న రాయి ధనరాజ్ ఇటీవల విద్యుత్ స్తంభంపై నుంచి పడి గాయపడ్డాడు. మంగళవారం అతన్ని జెడ్పీటీసీ మాజీ సభ్యురాలు గంగుమళ్ళ అన్నపూర్ణ పరామర్శించి విజయబేతాళ యువజన సంఘం, శ్రీకృష్ణదేవారాయ కాపు సభ్యులు నల్లా చిన్న నేతృత్వంలో రూ.15 వేలు సేకరించి బాధితుడు రాయి ధనరాజ్‌కు అందజేశారు. ఆమె వెంట గంగుమళ్ళ శ్రీనివాస్, గనిశెట్టి వెంకటేశ్వరరావు తదితరులు ఉన్నారు.

విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు

- ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు
- జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీ


మండపేటలో విద్యార్థులకు నగదు ప్రోత్సాహకాలు అందిస్తున్న ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు

మండపేట: పేద విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించడమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి విద్యావ్యవస్థలో విప్లవాత్మక మార్పులు తెచ్చారని ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు అన్నారు. స్థానిక సత్యశ్రీ రోడ్డులోని సర్దార్ వేగుళ్ల వీర్రాజు మున్సిపల్ హైస్కూల్లో మంగళవారం జగనన్న విద్యాకానుక కిట్ల పంపిణీని ఎమ్మెల్సీ తోట ప్రారంభించారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ మొండి భవాని అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. కుటుంబాన్ని అభివృద్ధిలోకి తెచ్చేది విద్యే అని, పేదవర్గాల వారు కూడా గొప్ప చదువులు చదవాలన్నదే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అందుకోసం నాడు నేడు పథకం కింద కార్పొరేట్ విద్యాసంస్థలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను సీఎం జగన్ అభివృద్ధి చేస్తున్నారన్నారు. వైఎస్సార్‌సీపీ రైతు విభాగం రాష్ట్ర కార్యదర్శి రెడ్డి రాజుబాబు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సదుపాయాలను తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకుని తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించడం ద్వారా వారి ఉన్నతికి బాటలు వేయాలన్నారు. అనంతరం ఇటీవల విడుదలైన 10వ తరగతి ఫలితాల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రభుత్వం ద్వారా మంజూరైన నగదు ప్రోత్సాహకాలను ఎమ్మెల్సీ తోట అందజేశారు. మున్సిపల్ కమిషనర్ టి. రామ్‌కుమార్, కౌన్సిల్ విప్ పోతంశెట్టి ప్రసాద్, మండల ప్రత్యేకాధికారి ఒ. రామకృష్ణ, ఎంపీడీఓ ఐ.రాజు, ఎంఈఓ ఎస్. రామచంద్రరావు, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షేక్ ఆలీఖాన్‌బాబా, మండపేట అర్బన్, రూరల్ కన్వీనర్లు ముమ్మిడివరపు బాపిరాజు, పిల్లా వీరబాబు, కౌన్సిలర్లు చిట్టూరి సతీష్, మలసాని సీతామహాలక్ష్మి, గ్రంధి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

పామర్రులో..

కె.గంగవరం: ప్రతి పేదవాడికి విద్యను అందించి వారి జీవితాల్లో వెలుగులు నింపేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని ఎంపీపీ పంపన నాగమణి, జెడ్పీటీసీ ఓబులనేని శ్రీవరలక్ష్మి అన్నారు. మండలంలోని పామర్రు ఉన్నత పాఠశాలలో మంగళవారం విద్యార్థులకు విద్యాకానుక కిట్లను వారు పంపిణీ చేశారు. సర్పంచ్ కోటి లక్ష్మీ నరసమ్మ, డీసీఎంఎస్ డైరెక్టర్ పెట్టా శ్రీనివాస్, మండల సచివాలయాల కన్వీనర్ తోకల శ్రీను, బీసీ నాయకులు పంపన సుబ్బారావు, సొసైటి అధ్యక్షుడు ఈదర రమేష్, హెచ్‌ఎం, వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

ద్రాక్షారామలో..

రామచంద్రపురం రూరల్: మండలంలోని ద్రాక్షారామ, హసన్‌బాద, వెల్ల జెడ్పీ హైస్కూళ్లలో ప్రజా ప్రతినిధులు, ఉపాధ్యాయులు, పేరెంట్స్ కమిటీ సభ్యుల చేతుల మీదుగా మంగళవారం విద్యార్థులకు జేవీకే కిట్లు పంపిణీ చేశారు. వెల్లలో ప్రధానోపాధ్యాయుడు బి.వీరభద్రరావు ఆధ్వర్యంలో, హసన్‌బాదలో ప్రధానోపాధ్యాయిని పీఎస్‌బీఎస్‌కే సుందరి ఆధ్వర్యంలో, ద్రాక్షారామలో ప్రధానోపాధ్యాయిని గుణ్ణం రాజేశ్వరి ఆధ్వర్యంలోను జరిగిన కార్యక్రమాల్లో జెడ్పీటీసీ మేర్నీడి వెంకటేశ్వరరావు, ఎంపీపీ అంబటి భవాని, జెడ్పీ కోఆప్షన్ సభ్యుడు తాతపూడి ప్రసన్న విజయకుమార్, సర్పంచ్‌లు వీరబోయిన సూరిబాబు, నాగిరెడ్డి సతీష్‌రావు, ఎంపీటీసీలు చిక్కాల స్వామికాపు, వైఎస్సార్ సీపీ జిల్లా కార్యదర్శులు టేకుమూడి సత్యనారాయణ, నున్న కల్యాణచక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.

చీకట్లవారిపేటలో..

కాజులూరు: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో రాష్ట్రంలో విద్యకు పెద్దపీట వేస్తున్నారని గొల్లపాలెం గ్రామ సర్పంచ్ పోతురాజు ప్రసన్న మౌనిక అన్నారు. మంగళవారం గొల్లపాలెం శివారు చీకట్లవారిపేట ప్రభుత్వ పాఠశాలలో సర్పంచ్, తదితర నాయకులు విద్యార్థులకు జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యావసతులు మెరుగుపరచటం ద్వారా నూరుశాతం విద్యాభివృద్ధి సాధించాలనే లక్ష్యంతో పాఠశాలల అభివృద్ధికి ముఖ్యమంత్రి జగనన్న రూ.కోట్లు ఖర్చు చేస్తున్నారన్నారు. 'నాడు–నేడు' పథకం ద్వారా పాఠశాలలకు ప్రత్యేక నిధులు మంజూరు చేసి వసుతులు సమృద్ధిగా సమకూరటంతో పాటు విద్యార్థులకు అవసరమైన సామగ్రి కిట్ రూపంలో జగనన్న విద్యాకానుక ద్వారా అందిస్తుంటడంతో విద్యాప్రమాణాలు మెరుగుపడ్డాయన్నారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ తాడి భువనేశ్వరిదేవి, స్కూల్ హెచ్‌ఎం ఎం.రామకృష్ణ, ఉపాధ్యాయులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.


గొల్లపాలెంలో విద్యార్థులకు జేవీకే కిట్లు పంపిణీ చేస్తున్న సర్పంచ్ ప్రసన్నమౌనిక


పామర్రులో విద్యార్థులకు విద్యాకానుక కిట్లు అందిస్తున్న ఎంపీపీ నాగమణి, జెడ్పీటీసీ సభ్యురాలు శ్రీవరలక్ష్మి


ద్రాక్షారామ జెడ్పీ హైస్కూల్లో విద్యాకానుకలు పొందిన విద్యార్థినులతో ప్రజాప్రతినిధులు